సాక్షి
అనంతపురం

బుధవారం, 2, ఆగస్టు, 2023



చీనీ టన్ను రూ.17 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.17 వేలు పలికాయి.



టమాట కిలో రూ.145

కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్ట ధర రూ.145 పలికింది. కనిష్టం రూ.120, సరాసరి రూ.133 ప్రకారం క్రయవిక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం 34.8°/22.6°

జిల్లా అంతటా మంగళవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలివేగం పెరిగింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి జల్లులు పడ్డాయి.

న్యూస్‌రీల్

టీబీ డ్యాంలో 79 టీఎంసీల నీరు



తుంగభద్ర జలాశయంలో తొణికిసలాడుతున్న నీరు

బొమ్మనహాళ్: ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో తుంగభద్ర జలాశయానికి వరద నీరు వచ్చి చేరుతోంది. మంగళవారం ఉదయానికి జలాశయంలో 79.168 టీఎంసీల నీరు నిల్వ ఉంది. 36,766 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. హెచ్చెల్సీ, ఎల్‌ఎల్‌సీ, రాయబసవన్న కెనాల్‌కు 2,066 క్యూసెక్కులు అవుట్‌ఫ్లో రూపంలో వెళ్తోంది. ఆంధ్రా సరిహద్దులో 105వ కిలోమీటర్ వద్ద హెచ్చెల్సీకి 989 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది.

రాయితీపై గడ్డివిత్తనాలు, దాణామృతం



జొన్న రకం గడ్డి



దాణామృతం

అనంతపురం అగ్రికల్చర్: పశువుల మేత కొరత రాకుండా అవసరమైన చర్యలు చేపట్టినట్లు పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్ వై.సుబ్రహ్మణ్యం, ఫాడర్ డెవలప్‌మెంట్ ఏడీ డాక్టర్ నాగార్జునరెడ్డి మంగళవారం 'సాక్షి'కి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు అవసరమైన రైతులకు 75 శాతం రాయితీపై గడ్డి విత్తనాలు (ఫాడర్ సీడ్), 60 శాతం రాయితీపై దాణామృతం (టోటల్ మిక్స్‌డ్ రేషన్- టీఎంఆర్) అందిస్తామన్నారు. ఆర్‌బీకేల్లో తమ వాటా చెల్లించి దరఖాస్తు చేసుకుంటే వెంటనే పంపిణీ చేస్తామని తెలిపారు. జొన్న రకం గడ్డి విత్తనాలు కిలోకు రాయితీ పోను రైతులు తమ వాటా కింద రూ.23 ప్రకారం, టీఎంఆర్ గడ్డి కోసం రాయితీ పోను కిలోకు రూ.6.50 ప్రకారం చెల్లించాలన్నారు. ఒక రైతుకు గరిష్టంగా 20 కిలోలు గడ్డి విత్తనాలు, 1800 కిలోల టీఎంఆర్ పంపిణీ చేస్తామని తెలిపారు. అవసరమైన రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఫెలోషిప్‌కు దరఖాస్తు చేసుకోండి

అనంతపురం రూరల్: గిరిజన విద్యార్థుల ఉన్నత విద్య కోసం 2023- 24 విద్యా సంవత్సరానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన జాతీయ ఫెలోషిప్ పథకానికి దరఖాస్తు చేసుకోవాలని జిల్లా గిరిజన సంక్షేమ అధికారి అన్నాదొరై సూచించారు. ఎంఫిల్, పీహెచ్‌డీల్లో ప్రవేశం పొందిన విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. https://fellowship.tribal.gov.in వెబ్ సైట్ ద్వారా ఈ నెల 31లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాల కోసం జిల్లా గిరిజన సంక్షేమ అధికారి కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

పండుగలా పింఛన్ పంపిణీ



అనంతపురంలో పింఛన్ అందిస్తున్న వలంటీర్

అనంతపురం: వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ మంగళవారం పండుగ వాతావరణంలో జరిగింది. 15 రకాల పింఛన్లలో 2,72,832 మందికి గాను తొలిరోజు 2,03,484 మంది లబ్ధిదారులకు నగదు పంపిణీ చేశారు. మొత్తం రూ.76.23 కోట్లు పంపిణీ చేయాల్సి ఉండగా, 56.80 కోట్లు (74.51 శాతం) పంపిణీ పూర్తయ్యింది. పంపిణీలో రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా పదో స్థానంలో ఉంది.

'ఓపెన్' డిగ్రీ ప్రవేశ గడువు పొడిగింపు

రాప్తాడు రూరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా డిగ్రీ కోర్సులు బీఏ, బీకాం, బీఎస్సీ మొదటి సంవత్సరం ప్రవేశాల దరఖాస్తుకు ఈ నెల 16 వరకు గడువు పొడిగించినట్లు మహిళా అభ్యసనా సహాయ కేంద్రం (నగరపాలక సంస్థ కార్యాలయం పక్కన) కో ఆర్డినేటర్ ఎస్.లక్ష్మీరంగయ్య తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఇంటర్, ఓపెన్ ఇంటర్, ఐటీఐ, పాలిటెక్నిక్, నర్సింగ్, తత్సమాన కోర్సుల్లో ఉత్తీర్ణులైన విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డీఎడ్, నర్సింగ్ చదువుతున్న విద్యార్థులకు అంబేడ్కర్ యూనివర్సిటీ డిగ్రీ వరం లాంటిదన్నారు. మరిన్ని వివరాలకు 08554-245908, 94901 21294 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

హైవేపై రయ్ రయ్

ఉమ్మడి జిల్లాలో టోల్‌గేట్ల నుంచి రోజుకు రూ.కోటి

- మరూరు, కాశేపల్లి టోల్‌గేట్ల నుంచే 60 శాతం వసూలు
- హైవేల్లో నిమిషానికి 55 వాహనాల పయనం
- భారీగా పెరుగుతున్న నాలుగు చక్రాల వాహనాల రాకపోకలు



సాక్షి ప్రతినిధి, అనంతపురం : జాతీయ రహదారులపై వాహనాలు రయ్‌మంటూ దూసుకెళ్తున్నాయి. బెంగళూరు – హైదరాబాద్ జాతీయ రహదారి ఎక్కువ భాగం ఉమ్మడి అనంతపురం జిల్లాలోనే ఉంది. ఈ రహదారి గుండా రోజూ వేలాది వాహనాలు గమ్యస్థానానికి చేరుకుంటున్నాయి. ఏటా సగటున 15 శాతం వాహనాల రాకపోకలు పెరుగుతున్నట్టు ఎన్‌హెచ్‌ఏఐ (నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా) అధికారుల పరిశీలనలో వెల్లడైంది.

నిమిషానికి 55 వాహనాలు

అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లోని జాతీయ రహదారులపై మొత్తం 10 టోల్‌గేట్లు ఉన్నాయి. వీటిగుండా రోజుకు 80 వేల వాహనాల వరకు ప్రయాణిస్తున్నట్టు అంచనా. దీన్నిబట్టి చూస్తే అన్నిచోట్లా కలిపి నిమిషానికి సగటున 55 వాహనాలు టోల్‌గేట్లు దాటుతున్నాయి. గత ఏడాదితో పోలిస్తే ఈ సంఖ్య 13 శాతం పెరిగినట్టు అంచనా వేస్తున్నారు. వీటిలో ఎక్కువ భాగం కార్లు ఉన్నట్టు తేలింది. ప్యాసింజర్ వాహనాలే ఎక్కువగా ప్రయాణిస్తున్నాయి.


టోల్‌గేట్ల ద్వారా రోజూ రూ.కోటి వసూలు

ఉమ్మడి జిల్లాలో టోల్‌గేట్ల ద్వారా రోజుకు రూ.90 లక్షల నుంచి కోటి రూపాయల వరకు వసూలవుతోంది. ప్రత్యేక సెలవు రోజులు, పర్వదినాల సందర్భంలో మరింత ఎక్కువగా ఉన్నట్టు తెలుస్తోంది. 60 శాతం వసూళ్లు రాప్తాడు మండలం మరూర్, పెద్ద వడుగూరు మండలం కాశేపల్లి టోల్‌గేట్ల ద్వారానే వస్తున్నాయి. ఇక్కడ ఒక్కో టోల్‌గేట్‌లో రోజుకు రూ.25 లక్షల నుంచి రూ.30 లక్షల వరకూ వసూలవుతోంది. మిగతా టోల్‌గేట్ల నుంచి రోజుకు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు వస్తున్నట్టు అంచనా. రానున్న ఏడాదిలో మరో రెండు టోల్‌గేట్లు అదనంగా వస్తున్నట్టు తెలుస్తోంది.

కార్ల విక్రయాల్లో దూకుడు

ఉమ్మడి జిల్లాలో కార్ల విక్రయాలు గతంతో పోల్చితే భారీగా పెరిగాయి. ముఖ్యంగా కరోనా నుంచి అనంతపురంలోని మెజార్టీ ప్రజలు కార్ల ప్రయాణాన్నే ఇష్టపడుతున్నారు. ఐదారేళ్ల కిందట నెలకు 150 కొత్త కార్లు కొనుగోలు అయితే మహా గొప్ప. కానీ 2022–23 ఆర్థిక సంవత్సరంలో వివిధ కార్ల షోరూముల్లో కొనుగోలు చేసినవి 400కుపైగా ఉన్నాయి. దీన్ని బట్టి చూస్తే సంవత్సరానికి 5వేల కార్ల విక్రయాలు జరుగుతున్నాయంటే వాటి దూకుడును అంచనా వేయొచ్చు. వీటి వల్ల కూడా ఉమ్మడి జిల్లాలో రోడ్లు బిజీ అవుతున్నాయని చెప్పుకోవచ్చు.

ఉమ్మడి అనంతపురం జిల్లాలో మొత్తం టోల్‌గేట్లు 10	రోజుకు సగటున వాహనాల రాకపోకలు 80 వేలు
టోల్‌గేట్ల ద్వారా రోజుకు వసూళ్లు రూ.కోటి	ఉమ్మడి జిల్లాలో స్టేట్ హైవే రోడ్లు 789 కిలోమీటర్లు
ఎన్‌హెచ్‌ఏఐ పరిధిలో రోడ్లు 325 కిలోమీటర్లు	



వాహనాలు పెరిగాయి



కరోనా తర్వాత నాన్ ట్రాన్స్‌పోర్టు వాహనాలు భారీగా పెరిగాయి. పబ్లిక్ ట్రాన్స్‌పోర్టేషన్ కంటే ప్రైవేటు ట్రాన్స్‌పోర్టేషన్‌కు ప్రజలు ఇష్టపడుతున్నారు. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడుతుండడం ద్వారా కొనుగోలు సామర్థ్యం కూడా పెరిగింది. గతంలో ఒక అంబాసిడర్ కారు, సెల్‌ఫోన్ ఉంటే గొప్పగా చూసేవాళ్లం. ఇప్పుడు ప్రతి ఒక్కరి దగ్గర సెల్‌ఫోను, చాలామంది వద్ద కార్లు కనిపిస్తున్నాయి. సొసైటీలో గొప్పగా ఉండాలని ప్రతి ఒక్కరూ ఆలోచిస్తున్నారు. అందుకే ప్రతి ఒక్కరూ సొంతంగా ద్విచక్రవాహనం, కార్లు కొనుగోలు చేస్తున్నారు. దీని వల్ల వాహనాల సంఖ్య భారీగా పెరుగుతోంది.

– వీర్రాజు, ఉప రవాణా కమిషనర్, అనంతపురం

ప్రైవేట్ ఆస్పత్రిలో శిశువు మృతి



మృతశిశువును చూపుతున్న కుటుంబ సభ్యులు

అనంతపురం క్రైం: నగరంలోని స్నేహలత ఆస్పత్రిలో శిశువు మృతి చెందింది. ఇందుకు వైద్యుల నిర్లక్ష్యమే కారణమని బాధిత కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. బాధితులు తెలిపిన మేరకు..అనంతపురం ఐదో రోడ్డులో నివాసముంటున్న ఆటో డ్రైవర్ షెక్షావలి భార్య కళ అలియాస్ రేష్మాబానును మూడో కాన్పు కోసం సోమవారం రాత్రి స్నేహలత ఆస్పత్రిలో చేర్పించారు. స్టాఫ్‌నర్సు మంజుల, ఇతర సిబ్బంది సూచన మేరకు షెక్షావలి రూ.వెయ్యి విలువైన మందులు తీసుకుని, రూ.5 వేలు అడ్వాన్స్ చెల్లించాడు. సాధారణ కాన్పు చేస్తామని ముందుగా చెప్పిన స్టాఫ్‌నర్సు..తర్వాత సిజేరియన్ చేయాలని డాక్టర్ చెప్పారంటూ మంగళవారం తెల్లవారుజామున ఐదు గంటలకే సమాచారమిచ్చారు. దీంతో షెక్షావలి మరో రూ.5 వేలు చెల్లించాడు. కాసేపటికే సిజేరియన్ పూర్తయిందని, అమ్మాయి పుట్టిందని చెప్పడంతో షెక్షావలి కుటుంబ సభ్యులు ఆనందపడ్డారు. అంతలోపే శిశువు మృతి చెందిందని గుడ్డలో చుట్టి ఇవ్వడంతో బోరున విలపించారు. శిశువు ఒంటిపై చర్మం ఊడిపోవడం, తలకు గాయం కన్పించడంతో ఆస్పత్రి నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ అక్కడే ఆందోళనకు దిగారు. ఆస్పత్రి నిర్వాహకురాలు డాక్టర్ అరుణ స్పందిస్తూ స్టాఫ్‌నర్సు మంజులతో పాటు డ్యూటీ డాక్టర్ (గైనకాలజిస్ట్ కాదు) గర్భిణిని పరిశీలించారని, ఆమె పరిస్థితిని గైనకాలజిస్టు శివజ్యోతి దృష్టికి తీసుకురాలేదని చెప్పారు. సిజేరియన్ చేయగా అప్పటికే శిశువు మృతి చెంది ఉందన్నారు. ఒక రోజు ముందే మృతి చెంది ఉంటే చర్మం ఊడిపోతుందని, ఆ గాయాలే పసికందు ఒంటిపై కనిపించాయని పేర్కొన్నారు. ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది బాధ్యతారాహిత్యంగా వ్యవహరించారని డీఎంహెచ్‌ఓ డాక్టర్ యుగంధర్ షోకాజ్ నోటీసు జారీ చేశారు.

టీడీపీ నాయకుల ఓవరాక్షన్

- ఓట్లు తొలగించారంటూ వాగ్వాదం
- ఇతరులు మాట్లాడకుండా పదేపదే అడ్డు తగిలిన వైనం
- అభ్యంతరం తెలిపిన వైఎస్సార్‌సీపీ నేతలపై దాడికి యత్నం



జెడ్పీ సీఈఓ, సీఐలతో వాగ్వాదం చేస్తున్న టీడీపీ నేతలు

ఉరవకొండ: ఓటరు జాబితా సవరణ అంశంపై రాజకీయ పార్టీలతో నిర్వహించిన సమావేశంలో ప్రతిపక్ష టీడీపీ నాయకులు ఓవరాక్షన్ చేశారు. ఇతర పక్షాల వారికి మాట్లాడే అవకాశం ఇవ్వకుండా పదేపదే అడ్డు తగిలి గందరగోళం సృష్టించారు. మంగళవారం ఉరవకొండ మండల పరిషత్ కార్యాలయంలో నియోజకవర్గ ఎన్నికల ప్రత్యేక అధికారి/ జెడ్పీ సీఈఓ భాస్కర్‌రెడ్డి అధ్యక్షతన ఓటరు జాబితా సవరణపై సమావేశం జరిగింది. ఇదివరకే ఇంటింటి సర్వేలో డబుల్ ఎంట్రీలు, చనిపోయిన వారు, వలసవెళ్లి ఇతర ప్రాంతాల్లో స్థిరపడిపోయిన వారిని గుర్తించారు. అటువంటి 7,200 ఓట్లను జాబితా నుంచి తొలగించారంటూ టీడీపీ నాయకులు పెద్ద సంఖ్యలో సమావేశానికి చేరుకుని అనవసరంగా వాగ్వాదానికి దిగారు. జెడ్పీ సీఈఓ స్పందిస్తూ నియోజకవర్గంలో ఇప్పటివరకు ఒక్క ఓటు కూడా తొలగించలేదని స్పష్టం చేశారు. ఎవరివైనా ఓట్లు తొలగించాలనుకుంటే క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ జరిపి.. అభ్యంతరాలు పరిశీలించిన తర్వాతే నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

వైఎస్సార్‌సీపీ నేతలపై దాడికి యత్నం

అధికారులకు, ఇతర రాజకీయ పార్టీల నాయకులకు మాట్లాడే అవకాశం ఇవ్వకుండా టీడీపీ నాయకులు అడ్డు తగులుతుండటంతో వైఎస్సార్‌సీపీ నేతలు జోక్యం చేసుకుని, ఇది మంచి పద్ధతి కాదన్నారు. ఆగ్రహంతో ఊగిపోయిన టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడికి యత్నించారు. ఇంతలో అర్బన్ సీఐ హరినాథ్, పోలీసు సిబ్బంది స్పందించి టీడీపీ నాయకులను బయటకు పంపారు. అయితే వైఎస్సార్ సీపీ నాయకులు తమపైనే దాడికి ప్రయత్నించారంటూ టీడీపీ నాయకులు ఆరోపిస్తూ ధర్నా చేశారు.

అనాథ పిల్లలను చదివించే సంస్థలకూ 'అమ్మఒడి'

రాప్తాడు రూరల్: అనాథ పిల్లల్ని చదివిస్తున్న, వారి బాగోగులు చూస్తున్న స్వచ్ఛంద సేవా సంస్థలకు 'అమ్మ ఒడి' పథకం వర్తింపజేసేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని డీఈఓ ఎం.సాయిరామ్ తెలిపారు. జిల్లాలో అనాథ పిల్లల్ని చదివిస్తున్న సంస్థల వివరాలను alsco.ananthapuramu@gmail.comలో నమోదు చేయాలని ఎంఈఓలు, హెచ్‌ఎంలను ఆదేశించారు.

ఆటోలోంచి పడిన నగదు బ్యాగు

- క్షణాల్లో అపహరించుకుపోయిన దుండగుడు

రాప్తాడురూరల్: ఆటోలో వస్తున్న ఓ మహిళ ఏమరుపాటుతో నగదున్న బ్యాగు కిందికి పడిపోయింది. ఆటోను నిలిపి...వెనక్కు పోయేలోగా బైకులో వచ్చిన గుర్తు తెలియని వ్యక్తి డబ్బుల బ్యాగు తీసుకుని ఉడాయించాడు. లబోదిబోమంటూ బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. వివరాల్లోకి వెళ్తే... పాపంపేటకు చెందిన వడ్డే పెద్దన్న, వడ్డే లక్ష్మీ దంపతులు. పెద్దన్న బేల్దారి పని చేస్తుండగా, లక్ష్మీ అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఆయాగా పని చేస్తోంది. వీరిది సొంతూరు ఆత్మకూరు కాగా... ఉపాధి కోసం అనంతపురం వచ్చి పాపంపేటలో నివాసం ఉంటున్నారు. లక్ష్మీ ఆత్మకూరులో డ్వాక్రా గ్రూపు సభ్యురాలిగా ఉంది. ఐదు రోజుల కిందట రూ.1.50 లక్షల రుణం మంజూరైంది. ఈ మొత్తం ఆత్మకూరులోని కెనరా బ్యాంకులో లక్ష్మీ ఖాతాలో జమ అయింది. సోమవారం ఆత్మకూరుకు వెళ్లి బ్యాంకులో డబ్బు డ్రా చేసుకుని సాయంత్రం 4.30 గంటల సమయంలో షేర్ ఆటోలో తిరుగు ప్రయాణమైంది. పాపంపేట జియో కార్యాలయం సమీపంలోకి రాగానే... లక్ష్మీ తన కూతురిని ఎత్తుకుని ఉంది. కూతురిని సర్దుకునే క్రమంలో డబ్బుల సంచి ఆటోలో నుంచి కిందకు పడిపోయింది. గమనించిన లక్ష్మీ ఆటోను ఆపాలంటూ అరిచింది. ఇంతలోనే ఆటో కొన్ని అడుగుల దూరం ముందుకు వెళ్లి ఆగింది. వెంటనే దిగిన లక్ష్మీ పరుగు పరుగున వెనక్కు వెళ్లింది. అదే సమయంలో అటుగా వస్తున్న ద్విచక్ర వాహనదారుడు బండిని ఆపి డబ్బుల సంచి తీసుకుని తుర్రుమన్నాడు. క్షణాల్లో ఈ ఘటన జరిగిపోవడంతో లక్ష్మీ గట్టిగా అరిచినా లాభం లేకపోయింది. దీంతో రూరల్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. పోలీసులు ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపారు.

నాడు ప్రాజెక్టుల పేరుతో దోపిడీ

- రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ధ్వజం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

అనంతపురం టవర్‌క్లాక్: టీడీపీ హయాంలో ప్రాజెక్టుల పేరుతో కాంట్రాక్టర్లకు నిధులు దోచి పెట్టారని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ధ్వజమెత్తారు. మంగళవారం ఆయన ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో విలేకరులతో మాట్లాడారు. ఈ నెల3న చంద్రబాబు జిల్లా పర్యటన నేపథ్యంలో వర్షాలు ఎక్కడ పడకుండా పోతాయోనని ప్రజలు బెంబేలెత్తిపోతున్నారన్నారు. ప్రాజెక్టులకు శిలాఫలకాలు ఆవిష్కరించినపుడు సమావేశం నిర్వహించిన చెట్టు కూడా ఎండిపోయిన ఘటన ప్రజలను వెంటాడుతోందన్నారు. చంద్రబాబు జీడిపల్లి రిజర్వాయర్ పర్యటన రద్దు చేసుకుంటే బాగుంటుందన్నారు. శ్రీశైలం రిజర్వాయర్ వద్ద పంప్‌హౌస్ నిర్మాణ అంశం టీడీపీ హయాంలో ఇచ్చిన 68 జీవోలో ఎక్కడా లేదన్నారు. అప్పట్లో హంద్రీ–నీవా కాలువ 128 కిలోమీటర్ల పొడవు మేర చూపించారని, శ్రీశైలం నుంచి చిత్తూరు జిల్లాకు 560 కిలోమీటర్లు ఉందన్నారు. పేరూరు జల సాధన సమితి పేరుతో పేరూరు డ్యాంకు హంద్రీ–నీవా నీటిని ఇవ్వాలని ఉద్యమాన్ని తీసుకొచ్చింది తానేనని ప్రకాష్‌రెడ్డి అన్నారు. జీడిపల్లి రిజర్వాయర్ నుంచి పేరూరు డ్యాంకు కాలువ తవ్వి మూడవ లిఫ్ట్ బోరంపల్లి ప్రాంతం నుంచి కళ్యాణదుర్గం, కంబదూరు మండలాల మీదుగా పేరూరు డ్యాంను నీటితో నింపాలని ప్రతిపాదనలు ఇవ్వగానే వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వెంటనే రూ.90 కోట్లతో డీపీఆర్ చేయించారన్నారు. 2009లో రాప్తాడులో జరిగిన బహిరంగ సభలో హంద్రీ–నీవా ద్వారా పేరూరు డ్యామ్‌కు నీళ్లు ఇస్తామని వైఎస్సార్ ప్రకటించారన్నారు. టీడీపీ హయాంలో ప్రకటించిన జీడిపల్లి–పేరూరు ప్రాజెక్టు అనేది పచ్చి మోసం, దగా, ఎందుకంటే ఈ ప్రాజెక్టుకు నీరు వచ్చే అవకాశం లేదన్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక హంద్రీ–నీవా 40 టీఎంసీల సాగునీటి ప్రాజెక్టుగా మార్చి మొదటివిడత జీడిపల్లి రిజర్వాయర్ వరకు పనులు పూర్తి చేశారన్నారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన నాలుగేళ్ల తరువాత జీడిపల్లి – అప్పర్ పెన్నార్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పేరుతో రూ.1,300 కోట్లతో డీపీఆర్ ఇచ్చారని, దీనిపై ఆరోపణలు రావడంతో తిరిగి రూ.800 కోట్లకు మార్పు చేశారన్నారు. పేరూరు డ్యామ్‌కు ఒక టీఎంసీ నీటిని కేటాయిస్తూ జీవో తెచ్చింది తామేనని, ఇచ్చింది జగనన్న అని, చెప్పిన మాట ప్రకారమే ప్రభుత్వం నుంచి రూపాయి డబ్బు తీసుకోకుండా దాతలు, రైతుల సహకారంతో పెన్నా నదిలో 40 కిలోమీటర్ల కాలువ తవ్వించి పేరూరు డ్యాంకు నీళ్లు తీసుకొచ్చామన్నారు. తమ నియోజకవర్గంలోనూ ఇంటి పట్టాల విషయంలో కోర్టులకెళ్లి అడ్డుకున్నారన్నారు.

అకృత్యాలకు కళ్లెం



- ఆడబిడ్డల రక్షణపై సర్కారు ప్రత్యేక దృష్టి
- సరిహద్దు ప్రాంతాల్లో భ్రూణహత్యల నివారణకు చర్యలు
- కర్ణాటకలోని స్కానింగ్ కేంద్రాలపైనా నిఘా
- ఆ రాష్ట్ర అధికారులతో సమన్వయం

- అనంతపురంలో లింగనిర్ధారణ పరీక్షలు చేసి, అబార్షన్ ద్వారా భ్రూణహత్యలకు కారణమవుతున్న అభిజ్ఞ నర్సింగ్ హోమ్ స్కానింగ్ సెంటర్‌ను వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు ఇటీవల సీజ్‌చేశారు. డాక్టర్ లక్ష్మీకాంతంను బాధ్యురాలుగా గుర్తించి చర్యలు తీసుకున్నారు.
- రాయదుర్గంలో ఓ మహిళ తొలి రెండు కాన్పుల్లో అమ్మాయిలకే జన్మనిచ్చింది. మగ సంతానం కోసం ఎదురు చూస్తున్న ఆమెకు మూడోసారి కూడా అమ్మాయే పుడుతుందని స్కానింగ్ సెంటర్‌లో పరీక్షల అనంతరం తెలిసింది. దీంతో కుటుంబ సభ్యులు ఆమెకు అబార్షన్ చేయించారు. ... ఇలా ఈ రెండు చోట్లే కాదు జిల్లాలో అక్కడక్కడా నిబంధనలకు విరుద్ధంగా అబార్షన్లు పెరుగుతుండటంతో రాష్ట్ర ప్రభుత్వం రంగంలోకి దిగి కట్టడికి చర్యలు చేపట్టింది. ఆడబిడ్డల రక్షణపై దృష్టి సారించింది.

రాయదుర్గం : గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నేరం. అమ్మాయి అయినా, అబ్బాయి అయినా సమానమే. అయితే కొందరు అమ్మాయిలంటే భారంగా భావిస్తున్నారు. వారిని పెంచి పెద్ద చేయడం, చదువు చెప్పించడం, పెళ్లి చేసి అత్తారింటికి పంపించడం ఇదంతా ఖర్చుతో కూడుకున్నదని.. వారి పట్ల వివక్ష చూపుతున్నారు. వంశం నిలబడటానికి, పెద్దయ్యాక తమ బాగోగులు చూసుకోవడానికి కుమారుడు కావాలని పరితపిస్తున్నారు. ఈ క్రమంలో గర్భంలో ఉన్నది ఎవరని తెలుసుకునేందుకు ఉత్సాహం చూపుతున్నారు. స్కానింగ్‌లో అమ్మాయి అని తేలితే అబార్షన్ చేయించేందుకు వెనుకాడడం లేదు. కర్ణాటక సరిహద్దున ఉన్న రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ, గుంతకల్లు నియోజకవర్గాల్లో అమ్మాయిలపై వివక్ష ఎక్కువగా కనిపిస్తోంది. ఈ ప్రాంతాలకు చెందిన వారు గర్భంలో ఉన్నది ఆడా.. మగ అనేది తెలుసుకునేందుకు బళ్లారిలోని స్కానింగ్ కేంద్రాలను ఆశ్రయిస్తున్నారు. ఆడ శిశువులని తెలియగానే అబార్షన్లతో గర్భంలోనే చిదిమేస్తున్నారు. జిల్లాలో ప్రతి వెయ్యిమంది అబ్బాయిలకు 905 మంది అమ్మాయిలు ఉన్నారు. లింగనిష్పత్తి పడిపోకుండా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. కర్ణాటక ప్రాంతంలోని స్కానింగ్ కేంద్రాలపై నిఘా పెంచేలా వైద్య, ఆరోగ్య శాఖకు ఆదేశాలు జారీ చేసింది. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారుల బృందం ఈ ఏడాది జూన్ 20న కర్ణాటకకు వెళ్లి చిత్రదుర్గం, తుమకూరు, బళ్లారి జిల్లాల వైద్య, ఆరోగ్య శాఖ అధికారులతో సమావేశం నిర్వహించింది. ఏపీకి సంబంధిన వారు స్కానింగ్ కోసం వస్తే తమకు తప్పకుండా సమాచారం ఇచ్చేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. కర్ణాటక నుంచి ఏపీకి వచ్చే వారి వివరాలను తాము తెలియజేస్తామని అంగీకారం తెలిపారు. భ్రూణహత్యలు నివారించి, అమ్మాయిల రక్షణకు చర్యలు చేపట్టేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని వైద్య ఆరోగ్య శాఖ అధికారులు చెబుతున్నారు.



జూన్ 20న బళ్లారిలో కర్ణాటక వైద్య, ఆరోగ్యశాఖ అధికారులతో సమావేశమైన డీఎంహెచ్‌ఓ యుగంధర్

జిల్లాలో ప్రైవేట్ ఆస్పత్రులు	438
స్కానింగ్ సెంటర్లు	152
సీజ్ చేసిన సెంటర్లు	1

బాలికలపై వివక్ష వద్దు

అమ్మాయిలైనా.. అబ్బాయిలైనా ఒక్కటే ఒకరు తక్కువ ఒకరు ఎక్కువ అని తేడా చూపాల్సిన అవసరం లేదు. అమ్మాయిలను భారంగా భావించరాదు. అమ్మాయిలు అన్ని రంగాల్లోనూ దూసుకుపోతున్నారు. అబ్బాయిలతో సమానంగా రాణిస్తున్నారు. అమ్మాయిలను బాగా చదివిస్తే వారి కాళ్లపై వారు నిలబడగలరు. అమ్మాయిలపై వివక్ష ప్రదర్శించరాదని అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో అవగాహన కల్పిస్తున్నాం.

– శ్రీదేవి, ఐసీడీఎస్ పీడీ, అనంతపురం

స్కానింగ్ కేంద్రాలపై నిఘా

గర్భవిచ్ఛిత్తికి ప్రధాన కారణం స్కానింగ్ కేంద్రాలుగా గుర్తించాం. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు స్కానింగ్ కేంద్రాలపై నిఘా పెంచాం. గర్భస్థ పిండ లింగనిర్ధారణకు పాల్పడే కేంద్రాలను సీజ్‌చేస్తున్నాం. సరిహద్దు ప్రాంతాల్లోని మూడు జిల్లాల డీఎంఅండ్‌హెచ్‌ఓలతో సమావేశం నిర్వహించి అప్రమత్తం చేశాం. బాలికల సంక్షేమానికి ప్రభుత్వం విశేష కృషి చేస్తోంది. అవగాహన లోపంతోనే కొందరు ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారు.

– యుగంధర్, డీఎంఅండ్‌హెచ్‌ఓ, అనంతపురం

క్లుప్తంగా

మేకకు పాలిచ్చిన ఆవు



ఆవు పాలు తాగుతున్న మేకపిల్ల

ఆత్మకూరు: రోజూ పాలివ్వడం ద్వారా మేక ఆకలిని తీరుస్తోంది ఓ ఆవు. ఆత్మకూరు మండలం తోపుదుర్తిలో కొన్ని రోజులుగా ఇదే తంతు కొనసాగుతోంది. గ్రామానికి చెందిన రైతు పోతులయ్య ఆవు తన దూడతో పాటు మేకపిల్లకూ పాలిస్తోంది. ఈ విషయం తెలుసుకున్న స్థానికులు అక్కడకు చేరుకుని చాలా ఆసక్తిగా గమనిస్తున్నారు.

నేడు బళ్లారి రాఘవ పురస్కారాల ప్రదానం

అనంతపురం కల్చరల్: తెలుగు రంగస్థలానికి వన్నె తెచ్చిన బళ్లారి రాఘవ జ్ఞాపకార్థం ఆయన పేరు మీద పురస్కారాలను అనంత రంగస్థలానికి విశేష సేవలందిస్తున్న వారికి బుధవారం ప్రదానం చేయనున్నారు. ఈ మేరకు లలిత కళాపరిషత్తు అధ్యక్షకార్యదర్శులు వెంకటసుబ్బయ్య, పద్మజ మంగళవారం తెలిపారు. పౌరాణిక రంగంలో చిదంబరరెడ్డి, లక్ష్మీనారాయణ, సాంఘిక నాటకాల్లో అరుణ్‌బాబు, ఖాదర్‌బాషాను జిల్లా స్థాయి అవార్డులకు ఎంపిక చేశారు. బుధవారం సాయంత్రం లలిత కళాపరిషత్తు వేదికగా జరిగే ఈ వేడుకకు అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి, ఏపీ నాటక అకాడమీ చైర్‌పర్సన్ రాగే హరిత ముఖ్యఅతిథులుగా హాజరు కానున్నారు.

ఏపీఎన్జీఓ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి

- జిల్లా ఎన్జీఓ సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి

గుంతకల్లు టౌన్: ఈ నెల 21, 22 తేదీల్లో విజయవాడలో జరిగే ఏపీఎన్జీఓ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఉద్యోగ, కార్మికులకు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బి.చంద్రశేఖర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ఎన్జీఓ హోమ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగుల న్యాయపరమైన డిమాండ్లు, సమస్యలను సమావేశంలో చర్చించనున్నట్లు పేర్కొన్నారు. వార్డు సచివాలయ ఉద్యోగుల ప్రమోషన్ ఛానల్, వారికి అందాల్సిన బకాయిలపై కూడా చర్చిస్తామన్నారు. రాష్ట్ర మహాసభలకు సచివాలయ ఉద్యోగులు కూడా పెద్ద సంఖ్యలో హాజరై ఉద్యోగుల ఐక్యతను చాటాలని కోరారు. సమావేశంలో ఏపీ ఎన్జీఓ సంఘం జిల్లా కార్యదర్శి చంద్రమోహన్, కార్యనిర్వాహక కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, మహిళా విభాగం జిల్లా చైర్‌పర్సన్ జమీలాబేగం, గుంతకల్లు తాలూకా అధ్యక్షురాలు సంపూర్ణ ఎస్తేరు, ఉపాధ్యక్షుడు యు.ఎర్రిస్వామి, కార్యదర్శి రామాంజినేయులు పాల్గొన్నారు.

మాట వినకపోతే మట్టుబెట్టాలని...

- కర్ణాటక వాసి కిడ్నాప్ కేసులో వీడిన మిస్టరీ
- ఏడుగురు కిడ్నాపర్ల అరెస్ట్
- రెండు కార్లు, పిడి బాకులు స్వాధీనం



నిందితులను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: కర్ణాటక వాసి కిడ్నాప్ కేసులో మిస్టరీని అనంత పోలీసులు ఛేదించారు. ఏడుగురిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. వివరాలను అనంతపురం మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ ధరణీకిషోర్ వెల్లడించారు. కర్ణాటకలోని రాయచూరు జిల్లా పురితిప్లి గ్రామ పంచాయతీ వార్డు సభ్యుడిగా గెలుపొందిన లలీంద్రను ఈ నెల 29న అనంతపురంలోని బళ్లారి బైపాస్ రోడ్డులో కిడ్నాప్ చేసిన ఉదంతం తెలిసిందే. ఎస్పీ శ్రీనివాసరావు ఆదేశాలతో మూడు బృందాలుగా పోలీసులు విడిపోయి కిడ్నాపర్ల కోసం వేట సాగించారు. సోమవారం రాత్రి బళ్లారి నుంచి బెంగళూరుకు రెండు కార్లలో బయలుదేరిన కిడ్నాపర్లు డి.హీరేహాళ్ మండలం ఓబుళాపురం చెక్‌పోస్టు వద్దకు చేరుకోగానే పోలీసులు గుర్తించి, అదుపులోకి తీసుకున్నారు. వీరి చెర నుంచి లలీంద్రను విడిపించారు.

పట్టుబడ్డారు ఇలా..

పురితిప్లి గ్రామ మేజర్ పంచాయతీకి ప్రతి రెండున్నరేళ్లకోసారి కొత్త సర్పంచ్‌ను ఎన్నుకుంటారు. ఈ క్రమంలో ఈ నెల 2న కొత్త సర్పంచ్ ఎన్నిక అనివార్యమైంది. సర్పంచ్‌గా వార్డు సభ్యులు సరిత, శశికళ పోటీపడ్డారు. ఎనిమిది చొప్పున మొత్తం 16 మంది వార్డు సభ్యులు రెండు గ్రూపులుగా విడిపోయారు. ఈ క్రమంలో అనంతపురంలో శిబిరాన్ని ఏర్పాటు చేసి తన వర్గానికి చెందిన 8 మంది వార్డు సభ్యులతో శశికళ చేరుకుంది. వీరిలో ఒకరి మద్దతు దొరికితే సర్పంచ్ స్థానం సరితకు దక్కుతుంది. దీంతో సరిత భర్త ప్రభాకర్ రంగంలో దిగి అదే గ్రామానికి చెందిన హనుమదాస్, హసికెళికు చెందిన ప్రశాంత్ వెంకటేష్, రవికుమార్, రైల్వే స్టేషన్ ఏరియా నివాసి సంజయ్, సీతాలాం కాలనీ నివాసి సతీష్‌కుమార్, మన్వీ తాలూకా ఆరోలి గ్రామానికి చెందిన మహేష్, రాయచూరుకు చెందిన బిన్నీ మహారాజ్, సురేష్ జిలాన్‌తో కలసి అనంతపురానికి వచ్చి లలీంద్రను కిడ్నాప్ చేశారు. అనంతపురం, కర్నూలు, బళ్లారి జిల్లాలోని పలు ప్రాంతాల్లో పోలీసుల కళ్లుగప్పి కార్లలో తిరుగుతూ లలీంద్రను తమ వైపునకు తిప్పుకునేందుకు విశ్వప్రయత్నం చేశారు. మాట వినకపోవడంతో చివరకు మట్టుబెట్టాలని నిర్ణయించుకుని బళ్లారి నుంచి బెంగళూరుకు వెళుతూ పోలీసులకు పట్టుబడ్డారు. బిన్నీ మహారాజ్, సురేష్ జిలాన్ తప్పించుకున్నారు. ఏడుగురు నిందితుల నుంచి రెండు కార్లు, పిడిబాకులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు. కాగా, కిడ్నాప్ కేసు ఛేదించిన సీఐ ధరణీకిషోర్, సీసీఎస్ సీఐ జీటీ నాయుడు, ఎస్‌ఐలు సుధాకరయాదవ్, శ్రీకాంత్, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

కరువు, చంద్రబాబు అవిభక్త కవలలు

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య



మాట్లాడుతున్న పైలా నరసింహయ్య

తాడిపత్రి: టీడీపీ అధినేత చంద్రబాబు ఎక్కడుంటే అక్కడ దుర్భిక్షం తాండవిస్తుందని, కరువు – చంద్రబాబు అవిభక్త కవలలని జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పైలా నరసింహయ్య అన్నారు. మంగళవారం తాడిపత్రిలోని గన్నెవారిపల్లి కాలనీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు, కరువు అవిభక్త కవలలని, వారిని విడదీయడం ఎవరి తరమూ కాదని ఎద్దేవా చేశారు. ఇటీవల లోకేష్ పాదయాత్ర చేస్తున్న ప్రాంతాల్లోనూ మేఘాలు విస్తరిస్తున్నా.. కనీసం చినుకు కూడా రాలలేదన్నారు. చంద్రబాబు హయాంలో కరువు కరాళ నృత్యం చేసిందన్నారు. జీవాలకు కనీసం మేత, నీరు కరువైన పరిస్థితి చంద్రబాబు పాలనలో చూశామన్నారు. కరువు మండలాలుగా ప్రకటించాలంటూ ఏటా ప్రజలు ధర్నాలు చేసిన ఘటనలు కోకోల్లలుగా ఉన్నాయన్నారు. ఈ పరిస్థితి వైఎస్ జగన్ పాలనలో లేదన్నారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు సమృద్ధిగా కురుస్తున్నాయన్నారు. ఎటు చూసినా జలకళ సంతరించుకుందన్నారు. పచ్చని పంటలతో వ్యవసాయం సుభిక్షంగా సాగుతోందన్నారు. విలువలకు, విశ్వసనీయతకు పెద్ద పీట వేస్తూ సీఎం వైఎస్ జగన్ సాగిస్తున్న పాలనపై యావత్ దేశ ప్రజలు దృష్టి సారించారన్నారు. ఇది గిట్టని చంద్రబాబు, లోకేష్ ఎల్లో మీడియాను అడ్డుపెట్టుకుని ప్రభుత్వంపై బురద చల్లే ప్రయత్నాలు చేస్తుండడం సిగ్గు చేటన్నారు. చంద్రబాబును తలచుకుంటే అవినీతి, అక్రమాలు, దారుణాలు, వెన్నుపోట్లు, అరాచకాలు గుర్తుకు వస్తాయన్నారు. సమావేశంలో రజకాభివృద్ధి సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు డీవీ కుమార్, వికలాంగుల సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు మారెం రంగనాథరెడ్డి పాల్గొన్నారు.

నివేదికలు పంపడంలో నిర్లక్ష్యమెందుకు?



మాట్లాడుతున్న గిరిజమ్మ, చిత్రంలో జెడ్పీ సీఈఓ భాస్కర్ రెడ్డి తదితరులు

- జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ అసహనం

అనంతపురం సిటీ: బీఆర్‌జీఎఫ్, ఎన్‌ఆర్‌ఈజీఎస్ సహా అనేక పథకాల కింద చేపట్టిన అభివృద్ధి పనులతో పాటు సంక్షేమ పథకాల అమలుకు సంబంధించి సమగ్ర నివేదికలు జెడ్పీకి పంపాలని పదేపదే ఆదేశిస్తున్నా ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఎంపీడీఓలపై జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ అసహనం వ్యక్తం చేశారు. అనంతపురంలోని జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ భవన్‌లో మంగళవారం సాయంత్రం నిర్వహించిన సమీక్ష సమావేశానికి ఉమ్మడి జిల్లాలోని అన్ని మండలాల ఎంపీడీఓలు హాజరయ్యారు. సీఈఓ భాస్కర్‌రెడ్డి, డిప్యూటీ సీఈఓ లలితా బాయితో కలసి గిరిజమ్మ సమీక్షించారు. నిర్లక్ష్యం వీడి రెండ్రోజుల్లోపు నివేదికలు పంపాలని స్పష్టం చేశారు. లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. మండలాల్లో ప్రభుత్వ పరంగా జరిగే కార్యక్రమాల్లో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులను ప్రోటోకాల్ ప్రకారం ఆహ్వానించాలని ఆదేశించారు. శిలాఫలకాలపై స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల పేర్లన్నీ ఉండేలా చూసుకోవాలన్నారు. సచివాలయాల సిబ్బంది విధులకు హాజరు కావడం లేదని ఎంపీడీఓలు మూకుమ్మడిగా ఆరోపించడంతో సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. పాఠశాలలను తనిఖీ చేసి, అక్కడి పిల్లలతో కలసి మధ్యాహ్న భోజనం తినాలని, ఆ ఫొటోలను తమకు పంపాలని సూచించారు.

లీజుకు ఆర్టీసీ స్థలాలు

- ఆర్టీసీ ఈడీ వెంకటేశ్వరరావు



స్థలాల లీజుపై సమావేశమైన ఈడీ వెంకటేశ్వరరావు

అనంతపురం సెంట్రల్: ఆర్టీసీ స్థలాల సంరక్షణలో భాగంగా వాటిని లీజుకు అందజేస్తున్నట్లు ఆ సంస్థ ఈడీ వెంకటేశ్వరరావు తెలిపారు. మంగళవారం అనంతపురంలోని ఆర్‌ఎం కార్యాలయంలో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు, వ్యాపారస్తులతో ఆయన సమావేశమై మాట్లాడారు. మొత్తం 20 మంది ఔత్సాహిక వ్యాపారస్తులు పాల్గొన్నారు. ఆర్‌ఎం కార్యాలయానికి ఉత్తరాన ఉన్న ఖాళీ స్థలాన్ని 33 సంవత్సరాల కాలపరిమితికి లీజుకు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 25 నుంచే టెండర్ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో ఉంచడం జరిగిందని తెలిపారు. ఈ-బిడ్ పద్ధతిలో టెండర్లను ఖరారు చేస్తామన్నారు. అనంతరం అనంతపురం డిపో, గుత్తి డిపోను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఆర్‌ఎం రమేష్‌బాబు, డిపో మేనేజర్ నాగభూపాల్, పలువురు ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

బసినేపల్లిలో పర్యటించిన కేంద్ర బృందం

గుత్తి రూరల్: స్వచ్ఛ భారత్ అభియాన్‌లో భాగంగా గుత్తి మండలం బసినేపల్లిలో కేంద్ర బృందం సభ్యుడు మణికుమార్ మంగళవారం పర్యటించారు. స్వచ్ఛ అభియాన్ కింద గ్రామానికి మంజూరైన కేంద్ర ప్రభుత్వ నిధుల వినియోగంపై క్షేత్ర స్థాయిలో అధ్యయనం చేశారు. ఈఓఆర్డీ శివాజీరెడ్డి, కార్యదర్శి ధనలక్ష్మి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు

శనగల గూడూరులో ఉద్రిక్తత



ఎస్సీ కాలనీ వాసులతో మాట్లాడుతున్న ఆర్డీఓ మధుసూదన్

పుట్లూరు: మండలంలోని శనగలగూడురులో ఉద్రిక్తత నెలకొంది. ఎస్సీలంతా ఓ వైపు, ఇతర సామాజిక వర్గాలు మరోవైపుగా విడిపోయారు. మొహర్రం వేడుకల్లో తమ సామాజిక వర్గానికి చెందిన యువతి పట్ల అదే గ్రామానికి చెందిన ఓ యువకుడు అసభ్యంగా ప్రవర్తించడమే ఇందుకు కారణంగా అగ్రవర్ణాలు ఆరోపిస్తుండగా.. తమ కాలనీ వద్ద బోరుబావిని తవ్వడానికి అభ్యంతరం చెప్పడం వల్లనే తమను ఇబ్బందులు పెడుతున్నారని ఎస్సీలు వాపోతున్నారు. దీంతో ఇరు వర్గాల మధ్య రాజీ కుదిర్చి గ్రామంలో ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకు ఆర్డీఓ మధుసూదన్, డీఎస్పీలు వెంకటశివారెడ్డి, గంగయ్య, సోషల్ వెల్ఫేర్ జేడీ మధుసూదన్‌రావు మంగళవారం ఆ గ్రామంలో పర్యటించారు. ఇరువర్గాల పెద్దలను సచివాలయంలో సమావేశపరిచి మాట్లాడారు. కాలనీ వద్ద బోరుబావి తవ్వితే గతంలో ఉన్న బోరులో నీటి మట్టం తగ్గి తమకు నీరు అందకుండా పోతుందని ఎస్సీలు తెలిపారు. అయితే మరో ప్రాంతంలో బోరు వేస్తే నీరు రావని అగ్ర వర్ణాల వారు పేర్కొన్నారు. దీంతో సర్వే చేయించి నీరు ఉన్న ప్రదేశంలో బోరు బావి ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ భరోసానివ్వడంతో వివాదం సద్దుమణిగింది. కాలనీ వారికి నీరు, సరుకులు ఇవ్వలేదనే ఫిర్యాదుపై స్పందించి మినరల్ వాటర్ ప్లాంట్ల వద్ద నీరు, షాపులలో సరుకులను ఇప్పించారు. భవిష్యత్తులో ఇలా చేయరాదని ఆయా దుకాణాదారులను హెచ్చరించారు. గ్రామంలో ఏర్పడిన ఉద్రిక్త పరిస్థితుల వల్ల పోలీస్‌పికెట్ కొనసాగిస్తున్నట్లు సీఐ వేణుగోపాల్ తెలిపారు.

ఛీకొట్టినా బుద్ధి రాలేదు



భూమి పూజ చేస్తున్న విప్ కాపు రామచంద్రారెడ్డి, తదితరులు

- చంద్రబాబుపై ప్రభుత్వ విప్ కాపు ధ్వజం

రాయదుర్గం: టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు లాంటి మోసకారి దేశ రాజకీయాల్లోనే మరొకరు లేరని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ధ్వజమెత్తారు. 2019 ఎన్నికల్లో ప్రజలు ఛీకొట్టినా ఇంకా బుద్ధి రాలేదని ఎద్దేవా చేశారు. రాయదుర్గంలోని 13, 14వ వార్డుల్లో రూ.20 లక్షల వ్యయంతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, కమిషనర్ దివాకర్ రెడ్డి, వైస్ చైర్మన్లు శ్రీనివాస్‌యాదవ్, వలీబాషా, మార్కెట్‌యార్డ్ చైర్మన్ భోజరాజనాయక్, ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఇల్లూరి శ్రీనివాసులు, పట్టణ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ ముస్తాక్, వివిధ వార్డుల కౌన్సిలర్లు, పార్టీ ఇన్‌చార్జ్‌లతో కలసి మంగళవారం ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడుతూ... బాబు పాలన తాలిబన్ల రాజ్యాన్ని మరిపించిందన్నారు. జన్మభూమి కమిటీల పేరుతో పేదల రక్తాన్ని జలగల్లా పీల్చేశారన్నారు. నీరు–చెట్టు, రెయిన్‌గన్ల పేరుతో రూ.వేల కోట్లు దోచేశారన్నారు. అధికారం కోసం అమలుకు సాధ్యం కాని 610 హామీలిచ్చి సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత అన్నీ వర్గాల ప్రజలను మోసం చేశారన్నారు. నవజాత శిశువు మొదలు.. ముసలి వారి వరకూ అందరినీ నట్టేటా ముంచిన మోసకారి చంద్రబాబని మండిపడ్డారు. తన తండ్రికి మళ్లీ అధికారం కట్టబెట్టాలంటూ ఊర్ల మీదపడి వార్డు సభ్యుడిగా కూడా గెలవలేని లోకేష్ ఏడుస్తున్నాడని విమర్శించారు. మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు అపద్దాలు చెప్పడంలో టీడీపీ అధినేత చంద్రబాబునే మించిపోయాడన్నారు. ఆయన చేశానంటున్న అభివృద్ధి కేవలం కాగితాల్లో తప్ప మరెక్కడ కనిపించడం లేదనే విషయాన్ని కాలవ గుర్తించాలన్నారు. రాజకీయాల్లో లబ్ధికోసమే రాయదుర్గానికి వలస వచ్చిన కాలవను నమ్మబోరాదన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన నాలుగేళ్లలోనే రాయదుర్గం ప్రాంతాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేశామన్నారు. ఇంతటి అభివృద్ధి సాధించాలంటే కనీసం 40 ఏళ్ల సమయం పడుతుందన్నారు. దివంగత నేత వైఎస్సార్ హయాంలో పట్టణానికి శాశ్వత తాగునీటి పథకం లభిస్తే, సీఎం జగన్ సారథ్యంలో పేదలందరికీ పక్కా ఇళ్లు దక్కాయన్నారు. ఎన్నో మంచి పనులతో ప్రజా సంక్షేమానికి తాము బాటలు వేస్తుంటే... అల్లర్లు సృష్టించి పబ్బం గడుపుకునేందుకు టీడీపీ నాయకులు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. రాబోవు ఎన్నికల్లో 175 స్థానాల్లోనూ వైఎస్సార్ సీపీ అభ్యర్థులే గెలుపొందుతారన్నారు. కౌన్సిలర్లు ప్రతాప్, పొరాళ్ల గోవిందరాజులు, భీమనపల్లి నాగవేణి, గౌని లావణ్య, శారదమ్మ, మమత, శ్రీనివాసరెడ్డి, శివపుత్ర, శ్రీలక్ష్మి, పైతోట సంజీవ, పద్మజ, గుమ్మఘట్ట జెడ్పీటీసీ పీఎస్ మహేష్, కాంట్రాక్టర్లు ఆర్‌టీ కాంతారెడ్డి, కొత్తపల్లి సత్యనారాయణరెడ్డి, అధికారులు, వార్డు ఇన్‌చార్జులు పాల్గొన్నారు.

ఇంటికే పౌష్టికాహారం

- గర్భిణులు, బాలింతలకు లబ్ధి

అనంతపురం సెంట్రల్: గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత, పోషకాహార లోపం నివారణ కోసం రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ సంపూర్ణ పోషణ పేరుతో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఇంటికే పౌష్టికాహారం (టేక్ హోం రేషన్–టీహెచ్‌ఆర్) అందించాలని నిర్ణయించింది. జిల్లాలో 18,980 మంది గర్భిణులు, 16,556 బాలింతలకు లబ్ధి చేకూరనుంది. ఇది వరకు అంగన్‌వాడీ కేంద్రాల్లో మధ్యాహ్న భోజనం వండి లబ్ధిదారులకు అందించేవారు. అంగన్‌వాడీ కేంద్రాలకు సుదూరంలో ఉన్న లబ్ధిదారులు, నడవలేని గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారానికి దూరమయ్యేవారు. అదే సమయంలో కొంతమేర పౌష్టికాహారం కూడా పక్కదారి పట్టేది. కానీ అందరికీ పౌష్టికాహారం అందించే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారుల ఇంటికే ఇవ్వాలని నిర్ణయించింది. ప్రతినెలా మొదటి, మూడవ శుక్రవారాల్లో పౌష్టికాహారం లబ్ధిదారులకు అందజేయనున్నారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ – టీహెచ్‌ఆర్ కింద ప్రత్యేక బ్యాగులో మూడు కిలోల బియ్యం, కిలో కందిపప్పు, అర కిలో వంట నూనె, 13 కోడిగుడ్లు, 2.5 లీటర్ల పాలు, రెండు కిలోల రాగి పిండి, కిలో బియ్యం అటుకులు, 250 గ్రాముల బెల్లం, 250 గ్రాముల వేరుశనగ చిక్కీలు, 250 గ్రాముల ఎండు ఖర్జూరం, మూడో శుక్రవారం 12 కోడిగుడ్లు, 2.5 లీటర్ల పాలు అందించనున్నారు.

రిమాండ్‌కు ఎనిమిది మంది

కళ్యాణదుర్గం: మొహర్రం వేడుకల్లో కళ్యాణదుర్గంలో అల్లర్లకు తెరలేపిన ఎనిమిది మందిని పోలీసులు మంగళవారం అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు ఎస్‌ఐ నాగమధు తెలిపారు. పట్టుబడిన వారిలో మారంపల్లి నివాసి ఎరికల రవి, జయనగర్ కాలనీకి చెందిన ఎరికల బాలు అలియాస్ ముత్యాలప్ప, ఎరికల చిన్నా, ఎరికల రఘు, ఎరికల రామాంజి, ఎరికల వంశీ, బట్టువాని వీధికి చెందిన ఎరికల హరి, సెంట్రల్ స్కూల్ సమీపంలో నివాసముంటున్న ఎరికల రమేష్ ఉన్నారు.

డ్రిప్, స్ప్రింక్లర్ల పంపిణీ వేగవంతం చేయాలి

- ఏపీఎంఐపీ పీఓ హరినాథరెడ్డి ఆదేశం

అనంతపురం అగ్రికల్చర్: ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి గాను 12,500 హెక్టార్ల డ్రిప్, స్ప్రింక్లర్ల లక్ష్యాన్ని డిసెంబర్‌లోపు పూర్తి చేయాలని ఏపీఎంఐపీ ప్రాజెక్టు ఆఫీసర్ (పీఓ) సీబీ హరినాథరెడ్డి ఆదేశించారు. మంగళవారం ఆయన గుంటూరు నుంచి స్థానిక ఏపీఎంఐపీ సిబ్బందితో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. అనంతపురం నుంచి ఆ శాఖ పీడీ జి.ఫిరోజ్‌ఖాన్, ఎంఐ ఇంజినీర్లు, డ్రిప్ కంపెనీ డీసీఓలు, సిబ్బంది పాల్గొన్నారు. రిజిస్ట్రేషన్లు, మంజూరు, ఇన్‌స్టాలేషన్‌లో ప్రస్తుతం అనంతపురం జిల్లా మొదటి స్థానంలో ఉందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకూ 2,697 మంది రైతులకు సంబంధించి 3,279 హెక్టార్లకు సూక్ష్మ సేద్యం పరికరాల మంజూరు పూర్తయిందన్నారు. కలెక్టర్, జేసీ సహకారంతో ఈ ప్రక్రియ మరింత వేగవంతం చేసి డిసెంబర్ లోపు లక్ష్యాన్ని పూర్తి చేస్తే తర్వాత డిమాండ్‌ను బట్టి అదనపు కేటాయింపులు చేస్తామన్నారు. కాగా, గతేడాదికి సంబంధించి పరికరాలు సరఫరా చేసినా ఇంకా పొలాల్లో బిగించుకోని 900 యూనిట్లు ఉన్నాయని, వీటిని ఈ నెలాఖరు లోపు వినియోగంలోకి తీసుకురావాలన్నారు. క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టి ప్రతి రైతు పరికరాలు సద్వినియోగం చేసుకునేలా చూడాలని ఆదేశించారు.

చెస్‌లో సత్తాచాటిన గుంతకల్లు వాసి

గుంతకల్లు టౌన్: గుంతకల్లుకు చెందిన పూజారి అనిల్ కుమార్ చెస్‌లో సత్తా చాటుకున్నాడు. ఈ ఏడాది మే నెలలో తిరువనంతపురంలో జరిగిన కాడిమిక్ కార్నివాల్ అంతర్జాతీయ చెస్ పోటీల్లో అద్భుతమైన ఆట తీరుతో మూడు నామ్స్ సాధించారు. ఈ క్రమంలోనే గత నెల 22, 23 తేదీల్లో భీమవరంలో జరిగిన బ్లిట్జ్ (స్పీడ్) విభాగంలో ప్రతిభ కనబరిచి అంతర్జాతీయ స్థాయిలో 1,270వ రేటింగ్ సొంతం చేసుకున్నాడు. తన విజయానికి సహకరించిన కర్ణాటకం నాగార్జునకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

వ్యక్తిపై దాడి... కాసేపటికే మృతి

అనంతపురం: ఆకుతోటపల్లి సచివాలయ పరిధిలో పనిచేస్తున్న వాటర్‌మెన్‌పై దాడి జరిగింది. కాసేపటికి ఆయన మృతి చెందాడు. ఇటుకలపల్లి సీఐ నరేంద్ర రెడ్డి తెలిపిన మేరకు.. వాటర్‌మెన్‌గా పనిచేస్తున్న మునీంద్ర (35) మద్యం మత్తులో పదేళ్లుగా భార్య నల్లమ్మను శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురి చేస్తూ వచ్చాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం గొడవపడడంతో మునీంద్రను భార్య నల్లమ్మ, ఆమె సోదరుడు నరేష్, అతని స్నేహితులు హరి, రామ్మోహన్, వెంకటేశులు కొట్టి, సముదాయించారు. అనంతరం కాసేపటికి మంచినీళ్లు తాగిన మునీంద్ర ఉన్నఫళంగా కుప్పకూలి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టినట్లు సీఐ నరేంద్రరెడ్డి తెలిపారు.

గవిమఠం భూముల స్వాహాపై విచారణ

సాక్షి ఎఫెక్ట్..

ఉరవకొండ: అన్యాక్రాంతమైన గవిమఠం భూముల అంశంపై విచారణకు అధికారులు సిద్ధమయ్యారు. కర్ణాటకలోని అసాండిలో దాదాపు రూ.10 కోట్ల విలువైన భూములు అన్యాక్రాంతమైన విషయాన్ని 'గవిమఠం భూములు స్వాహా' శీర్షికన మంగళవారం 'సాక్షి'లో వెలువడిన కథనంపై దేవదాయ శాఖ అధికారులు స్పందించారు. పూర్తి స్థాయిలో విచారణ జరిపి నివేదిక సమర్పించాలని మఠం సహాయ కమిషనర్ చిట్టెమ్మను ఆదేశించారు. దీంతో మఠం సిబ్బందితో కలసి ఆమె మంగళవారం ఉదయం అసాండి గ్రామంలో పర్యటించారు. చోటుచేసుకున్న అక్రమాలపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. రెవెన్యూ అధికారులను కలసి రికార్డులు తీసుకున్నారు.

రేపు అనంతలక్ష్మిలో ప్లేస్‌మెంట్ డ్రైవ్

అనంతపురం: నగర శివారులోని అనంతలక్ష్మి ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మూర్తి రావు ఖోఖలే తెలిపారు. 2019, 2020, 2021, 2022, 2023 సంవత్సరాల్లో బీఎస్సీ, బీఏ, బీకాం, బీటెక్, ఎంటెక్, ఎంబీఏ, ఎమ్మెస్సీ, ఎంకాం కోర్సులు పూర్తి చేసిన ఉమ్మడి జిల్లాకు చెందిన వారు అర్హులు.ఆసక్తి గల వారు రెజ్యూమ్, ప్రొవిజనల్ సర్టిఫికెట్, పాన్‌కార్డు, పాస్‌పోర్టు తీసుకుని రావాలి.

బలమైన లక్ష్యముండాలి : ఎస్పీ

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: బలమైన లక్ష్యంతో ముందుకెళితే సాధన సులువవుతుందని ఎస్పీ కె.శ్రీనివాసరావు అన్నారు. గెలుపునకు అతి చేరువలో ఉన్నామంటూ నిర్లక్ష్యం చేస్తే అవకాశం చేజారే ప్రమాదముంటుందని హెచ్చరించారు. ఎస్‌ఐ పరీక్షల్లో అర్హత సాధించి జిల్లా పోలీసుశాఖ తరఫున పరేడ్ మైదానంలో ఉచిత ఈవెంట్స్ తర్ఫీదు తీసుకుంటున్న అభ్యర్థులతో మంగళవారం ఆయన మాట్లాడారు. పరీక్షల్లో పాసైతే చాలదన్నారు. ఈవెంట్స్‌లో కూడా విజయం సాధించాలన్నారు. ఈవెంట్స్ అనంతరం మెయిన్ పరీక్షకు ఎలా సిద్ధమవ్వాలో అవగాహన కల్పించారు.

'అశ్విని'కి నార్పల కేజీబీవీలో సీటు

సాక్షి ఎఫెక్ట్..

రాప్తాడు రూరల్: గుత్తి మండలం బేతాపల్లి గ్రామానికి చెందిన నిరుపేద విద్యార్థిని జి.అశ్వినికు నార్పలలోని కేజీబీవీలో 8వ తరగతిలో సీటు దక్కింది. అశ్విని తండ్రి జి.సుధాకర్ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండడంతో తల్లి సుజాత కూడా ఇటీవల అనారోగ్యానికి గురైంది. దీంతో తమ కుమార్తెకు మంచి భవిష్యత్తు ఇవ్వాలని భావించిన తల్లిదండ్రులు మూడు రోజుల క్రితం డీఈఓ ఎం.సాయిరామ్‌ను కలిసి వేడుకున్నారు. ఈ అంశంపై 'నా కూతురికి కేజీబీవీలో సీటు ఇప్పించండి' శీర్షికన 'సాక్షి'లో కథనం వెలువడింది. దీనిపై స్పందించిన అధికారులు నార్పల కేజీబీవీలో ఆమెకు అవకాశం కల్పించారు. వివరాలను కేజీబీవీకి పంపామని బుధవారం వెళ్లి పాఠశాలలో చేరొచ్చని జీసీడీఓ వాణీదేవి తెలిపారు.

క్లుప్తంగా

హౌసింగ్ డీఈగా దేవరకొండ రామ్మూర్తి



రాప్తాడు: రాప్తాడు సబ్ డివిజన్ హౌసింగ్ డీఈగా దేవరకొండ రామ్మూర్తి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న డీఈ కృష్ణారావు హౌసింగ్ ఈఈగా పదోన్నతిపై అనంతపురానికి వెళ్లారు. డీఈ దేవరకొండ రామ్మూర్తి రాప్తాడు మండల హౌసింగ్ ఏఈగా పనిచేశారు. అనంతరం ఆయన్ని రాప్తాడు హౌసింగ్ కార్యాలయంలో సన్మానించారు.

పేదల పక్షపాతి వైఎస్ జగన్



బ్రోచర్లు విడుదల చేస్తున్న దృశ్యం

అనంతపురం సిటీ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముస్లిం మైనార్టీల పక్షపాతి అని నగర మేయర్ వసీం , వక్ఫ్‌బోర్డు చైర్మన్ కాగజ్ ఘర్ రిజ్వాన్, వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైపుల్లా బేగ్ అన్నారు. మంగళవారం స్థానిక లెనిన్ నగర్‌లోని మస్జీద్–ఏ–అబూబకర్ మసీదులో 'హర్ దిల్ మే వైఎస్సార్–హమ్ సబ్ జగన్‌కే సాత్' కార్యక్రమాన్ని నిర్వహించారు. నమాజు అనంతరం ముస్లిం మత పెద్దలతో వారు సమావేశమయ్యారు. ముస్లింల అభ్యున్నతికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్న సీఎం జగన్‌కు అండగా ఉందామని వారు పిలుపునిచ్చారు. అనంతరం సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రహంతుల్లా, మసీదు ముతవల్లి ఖాదర్‌బాషా, మసీదు ఇమామ్ అబ్దుల్ వాహిద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



ర్యాలీగా వెళ్తున్న విద్యుత్ ఉద్యోగులు

అనంతపురం టౌన్: న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని విద్యుత్ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ జీటీ శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం నగరంలో మంగళవారం విద్యుత్ ఉద్యోగులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ సంస్థల్లో ఉద్యోగుల భర్తీ చేపట్టకపోవడంతో పనిభారం పెరుగుతోందన్నారు. మెడికల్ పాలసీని కుటుంబ సభ్యులందరికీ అమలు చేయాలన్నారు. నగదు రహిత అపరిమిత వైద్య సేవలు అందించాలన్నారు. విద్యుత్ సంస్థల్లో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విధానాల్లో పని చేస్తున్న ఉద్యోగులను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించి వేతనాలు అందించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా జేఏసీ నాయకులు వెంకటరమణ, రాఘవరెడ్డి, విద్యుత్ ఉద్యోగుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓటరు నమోదు చేపట్టండి



మాట్లాడుతున్న నియోజకవర్గ ఈఆర్వో నరసింహారెడ్డి

రాప్తాడు: ప్రత్యేక ఓటరు నమోదును పారదర్శకంగా చేపట్టాలని డీఆర్‌డీఏ పీడీ, ఎన్నికల ఈఆర్వో నరసింహా రెడ్డి ఆదేశించారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఓటర్ల జాబితాపై నియోజకవర్గంలోని ఆరు మండలాల్లోని సూపర్ వైజర్లతో ఆయన సమావేశమయ్యారు. అనంతరం ఈఆర్ఓ మాట్లాడుతూ ఈనెల 21 వరకు కార్యక్రమం ఉంటుందన్నారు. సర్వేలో ఎలాంటి రాజకీయ ప్రమేయం ఉండకూడదన్నారు. జాబితాలో డబుల్ ఎంట్రీలు, మరణించిన వారి ఓట్లు, బోగస్ ఓట్లు తొలగిస్తామన్నారు. లో ఆరు మండలాల తహసీల్దార్లు, ఈడీటీ విజయ్‌కుమార్, ఆరు మండలాల సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి బలరాముడు కృషి



బలరాముడు వర్ధంతి నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రాప్తాడు: పార్టీ బలోపేతానికి రాప్తాడు మాజీ సర్పంచు, మాజీ ఎంపీటీసీ, బీసీ సంఘం నాయకుడు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు మాన్లుకోసే బలరాముడు కృషి చేసినట్లు వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు, యూత్ మండల కన్వీనర్ చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం రాప్తాడులో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు ఎం.బలరాముడు ద్వితీయ వర్ధంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నగరం నలుదిక్కులా అభివృద్ధి

- నగరపాలక సంస్థ మేయర్ వసీం



రెండో రోడ్డులో బీటీ రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న మేయర్ వసీం

అనంతపురం క్రైం: గత టీడీపీ ప్రభుత్వంలో అభివృద్ధి అటకెక్కిందని, వైఎస్సార్‌సీపీ అధికారంలోకొచ్చిన తర్వాత నగరం నలుదిక్కులా అభివృద్ధి చెందుతోందని మేయర్ వసీం అన్నారు. మంగళవారం నగరంలోని 44,45 డివిజన్ల పరిధిలో సీఎం ప్రత్యేక నిధులు రూ.57 లక్షలతో చేపడుతున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు మేయర్ వసీం భూమి పూజచేశారు. నగరంలో గుత్తి రోడ్డు, ఎన్‌టీఆర్ మార్గ్, నలుదిక్కులా రోడ్ల నిర్మాణం, ఆర్‌ఓబీ పూర్తయ్యిందని, బళ్లారి బైపాస్ నుంచి పంగల్ రోడ్డు వరకు ఫోర్‌వే పనులు శరవేగంగా సాగుతున్నాయన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం నిధులు రూ.14.80 కోట్లు, సీఎం ప్రత్యేక నిధులు రూ.25 కోట్లు, ఇంకా మరిన్ని నిధులతో నగరంలో అంతర్గత రోడ్లు, కాలువలు, కమ్యూనిటీ హాళ్ల ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం 11వ డివిజన్‌లో సాధారణ నిధులు రూ.18 లక్షలతో జరుగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను మేయర్ పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, వైఎస్సార్ సీపీ సీనియర్ నేత అనంత చంద్రారెడ్డి, ఎస్ఈ నాగమోహన్, కార్పొరేటర్లు చంద్రమోహన్ రెడ్డి, రాజేశ్వరి, అనిల్‌కుమార్ రెడ్డి, సైపుల్లాబేగ్, లాలూ, శాంతిసుధ, బాలాంజనేయులు, కో ఆప్షన్ సభ్యులు షంషుద్దీన్, నాయకులు మధు, సుబ్బయ్య పాల్గొన్నారు.

వృద్ధులకు కళ్లద్దాలు పంపిణీ: 42వ డివిజన్‌లో సూర్య కంటి ఆస్పత్రి, నీమా ఆప్టికల్స్ సౌజన్యంతో దృష్టి లోపం ఉన్న వృద్ధులకు మేయర్, అనంత చంద్రారెడ్డి కళ్లద్దాలు పంపిణీ చేశారు.

ఘనంగా ఎమ్మెల్యే అనంత జన్మదిన వేడుకలు: ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని మంగళవారం 42వ డివిజన్‌లో మేయర్ వసీం, పార్టీ సీనియర్ నేత అనంత చంద్రారెడ్డి కేక్ కట్ చేసి, పేదలకు పంచిపెట్టారు. శారద మునిసిపల్ హై స్కూల్‌లో ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్ శ్యామల అనిల్‌కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే అనంత జన్మదిన వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు అనిల్‌కుమార్ గౌడ్, సుజాత, భారతి,జయమ్మ, గుజిరి హరినాథ్, కృష్ణమూర్తి, ఆసిఫ్, ఇద్రీష్, సోహైల్, సాయి పాల్గొన్నారు.

ఫ్లోరోసిస్ బాధితులకు ప్రత్యేక పరీక్షలు



వాకర్లు అందిస్తున్న డాక్టర్ దయాకర్

ఆత్మకూరు: మండలంలోని అన్ని గ్రామాల్లో ఫ్లోరోసిస్ అనుమానిత ప్రాంతాల్లో ప్రత్యేక పరీక్షలు నిర్వహించి, గ్రామాల్లో సర్వేచేస్తున్నట్లు మండల వైద్యాధికారి దయాకర్ తెలిపారు. మంగళవారం జాతీయ ఫ్లోరోసిస్ నివారణ కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రభుత్వాస్పత్రిలో జాగ్రత్తలు తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా ఎన్సీడీ అధికారి నారాయణస్వామి, జిల్లా ఫ్లోరోసిస్ అధికారి ఆంజనేయులు, సిబ్బంది శశికళ, కిశోర్ పాల్గొన్నారు.

ఆత్మకూరులో ఆశాడే ..

స్థానిక ప్రభుత్వాస్పత్రిలో మంగళవారం ఆశా డే కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ మాట్లాడుతూ ఈ నెల 5వ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలపై అవగాహన కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ నెల 10న మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ ఉంటుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు సుల్తానా, వైద్య సిబ్బంది నాగేశ్వరయ్య, మునాఫ్, శమీమ్ తదితరులు పాల్గొన్నారు.

వార్డెన్లు స్థానికంగా నివాసం ఉండాలి

- సాంఘిక సంక్షేమ శాఖ జేడీ మధుసూదన్‌రావు



మాట్లాడుతున్న సాంఘిక సంక్షేమ శాఖ జేడీ మధుసూదన్‌రావు

అనంతపురం రూరల్: వసతి గృహాలు, గురుకుల పాఠశాలల్లో సమస్యల్లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత వార్డెన్లు, సహాయ సంక్షేమ అధికారులపై ఉందని సాంఘిక సంక్షేమశాఖ జాయింట్ డైరెక్టర్ మధుసూదన్ తెలిపారు. మంగళవారం బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో సహాయ సంక్షేమ అధికారులు, వార్డెన్లతో సమావేశం నిర్వహించారు. జేడీ మాట్లాడుతూ ప్రభుత్వం సూచించిన మార్గదర్శాలను దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ బాధ్యతగా పని చేయాలన్నారు. నూతన మెనూ సక్రమంగా అమలు చేయడంతో పాటు వసతి గృహాల్లో ఎప్పటికప్పుడు పర్యవేక్షణ ఉండాలన్నారు. విద్యార్థులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత వార్డెన్లు, సహాయ సంక్షేమ అధికారులపై ఉందన్నారు. విద్యార్థులకు సమాజం, నైతిక విలువల పట్ల అవగాహన కల్పించాలన్నారు.

రైతులకు రుణమాఫీ ప్రకటించాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు, చిత్రంలో రాంభూపాల్

అనంతపురం అర్బన్: రాష్ట్రంలో ఒకవైపు వరదలు, మరోవైపు కరువు పరిస్థితులు నెలకొని రైతులు తీవ్రంగా నష్టపోయారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. ఇలాంటి సమయంలో వారిని ఆదుకునేందుకు ప్రభుత్వం రుణమాఫీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఆయన మంగళవారం అనంతపురంలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. 2020 సంవత్సరంలో రైతుల ఆత్మహత్యలు తగ్గినప్పటికీ ఈ మూడేళ్లలో క్రమంగా పెరుగుతున్నాయన్నారు. ప్రభుత్వం ఇస్తున్న రూ.7 లక్షల పరిహారం అన్ని బాధిత కుటుంబాలకు అందడం లేదన్నారు. రైతు ఏ రూపంలో చనిపోయినా తెలంగాణ తరహాలో రూ.5 లక్షల పరిహారం ఇక్కడా ఇవ్వాలని సూచించారు. పంటల బీమా విధానం లోపభూయిష్టంగా ఉందన్నారు. 2022లో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో పంటలబీమా కంపెనీలకు లక్షల కోట్ల రూపాయల ప్రీమియం కడితే పరిహారంగా ఇచ్చింది రూ.700 కోట్లు మాత్రమే అన్నారు. కాబట్టి పంటల బీమా ద్వారా రైతులకు లాభం చేకూర్చే విధానం తీసుకురావాలన్నారు. మణిపూర్ ఘటనపై కేంద్రాన్ని పార్లమెంట్‌లో రాష్ట్ర ఎంపీలు నిలదీయాలన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణ పౌర్ణమి వేడుకలు



మూడోరోడ్డులోని ఆలయంలో పూజలందుకున్న సత్యదేవుడు

అనంతపురం కల్చరల్: నగరంలోని పలు ఆలయాల్లో శ్రావణపౌర్ణమి వేడుకలు మంగళవారం భక్తిశ్రద్ధలతో జరిగాయి. శివకోటిలో శివయ్య స్వామీజీ నేతృత్వంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు శాస్త్రోక్తంగా జరిగాయి. మూడోరోడ్డులోని షిర్డీసాయిబాబా మందిరం, అశోక్‌నగర్‌లోని శ్రీరమాదేవి సమేత సత్యనారాయణస్వామి ఆలయంలో పెద్ద ఎత్తున వ్రతాలు నిర్వహించారు. భక్తులు బారులు తీరి భక్తిశ్రద్ధలతో స్వామిని ఆరాధించుకున్నారు.మధ్యాహ్నం అన్నవరం సత్యదేవుడి ప్రసాదం వితరణ చేశారు.

నులిపురుగులు నివారించుకోవాలి



మొబైల్ ఫోన్‌లో యాప్‌లపై అవగాహన కల్పిస్తున్న ఏడీఎంహెచ్‌ఓ సుజాత

రాప్తాడు: జిల్లా వ్యాప్తంగా నులిపురుగుల నివారాణకు ఈ నెల 10న ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్నట్లు ఏడీఎంహెచ్ఓ సుజాత పేర్కొన్నారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో ఆశా కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ 1 నుంచి 19 ఏళ్ల నిండిన పిల్లలు, యువతకు మాత్రలు వేయాలని సూచించారు. మండల వ్యాప్తంగా గుర్తించిన పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాల, కళాశాలల్లో ఈ మాత్రలు పంపిణీ చేయాలన్నారు. వైద్యాధికారి శ్రావణి మాట్లాడుతూ ఈ నెల 7 జరిగే తల్లి పాల వారోత్సవాలు జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ శివప్రసాద్, సూపర్ వైజర్లు అరుణమ్మ, లక్ష్మీనారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

రాప్తాడు: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సాల్మన్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్న సమావేశానికి మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, మండల స్థాయి అధికారులందరూ హాజరుకావాలన్నారు.

కఠిన ఉపవాస దీక్షల విరమణ

అనంతపురం కల్చరల్: జైనుల సంప్రదాయంలో అనాదిగా వస్తున్న కఠిన ఉపవాస దీక్షల విరమణ మంగళవారం సాయంత్రం జరిగింది. స్థానిక పాతూరు ఆర్యవైశ్య వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఉపవాస దీక్ష ముగింపు వేడుకలు నిర్వహించారు. నగరానికి చెందిన వస్త్రవ్యాపార సంఘం నాయకులు వసంతకుమార్ జైన్ సతీమణి బబితావసంత్ జైన్ గత జూలై 1 నుంచి ఆగస్టు 1 వరకు అత్యంత కఠిన ఉపవాస దీక్షలు పాటించారు. సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు మంచినీళ్లు మాత్రమే తీసుకుని, ముప్పైరోజుల పాటు ఉపవాస దీక్ష చేశారు. ఆమె దీక్ష విరమణ కార్యక్రమాన్ని జైన్ల సంఘం ప్రతినిధులు వేడుకగా నిర్వహించారు. బబితాజైన్‌ను పలువురు అభినందించి సత్కరించారు.

పోక్సో కేసు నమోదు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: స్థానిక టూటౌన్ పరిధిలోని బాలికపై అసభ్యకరంగా ప్రవర్తించిన భరత్ అనే యువకుడిపై టూటౌన్ పోలీసులు మంగళవారం పోక్సో కేసు నమోదు చేశారు. పామిడి మండలం పామిడి కొండాపురానికి చెందిన భరత్ ఎలక్ట్రీషియన్‌గా పనిచేసేవాడు. అనంతపురం టూటౌన్ పరిధిలో ఉండే ఓ బాలికను ప్రేమ పేరుతో వంచించి, మోసం చేశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

అరుణోదయ కాలనీలో మహిళ మృతి

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: త్రీటౌన్ పరిధిలోని అరుణోదయ కాలనీకి చెందిన ఫర్వీన్ (35) ఆకస్మాత్తుగా మృతిచెందింది. వివరాలు.. ధర్మవరానికి చెందిన ఫర్వీన్ ఇళ్లలో పాచిపని చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. మంగళవారం సాయంత్రం ఇళ్ల పని ముగించుకొని ఇంటికి వెళ్తూ వాంతులు చేసుకొని కిందపడిపోయింది. స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు ఆమెను ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందింది. మృతురాలి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు రాగానే కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తామని త్రీటౌన్ సీఐ ధరణీకిశోర్ తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

రాప్తాడురూరల్: సమగ్ర శిక్ష కార్యాలయం సహిత విద్య విభాగంలో ఖాళీగా ఉన్న రెండు ఫిజియోథెరపీ పోస్టులను తాత్కాలిక ప్రాతిపదికన భర్తీ చేయనున్నట్లు సమగ్ర శిక్ష అడిషన్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఎం.సాయిరామ్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్హత గల అభ్యర్థులు (బ్యాచిలర్ ఆఫ్ ఫిజియోథెరపిస్ట్) దరఖాస్తులను ఈనెల 5లోపు సమగ్రశిక్ష కార్యాలయంలో అందించాలని కోరారు.

8 మందికి ఇంటర్నేషనల్ ఫిడే రేటింగ్

అనంతపురం: అఖిల భారత చదరంగ సమాఖ్య, ప్రపంచ చదరంగ సమాఖ్య సంయుక్తంగా విడుదల చేసిన ఫిడే రేటింగ్‌లో అనంతపురం జిల్లాకు చెందిన 8 మంది చెస్ క్రీడాకారులున్నారు. ఈ మేరకు అనంతపురం చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు శివకుమార్, కార్యదర్శి ఉదయ్‌కుమార్ నాయుడు తెలిపారు. రేటింగ్ దక్కించుకున్న వారిలో కొండూరు సాయిరామ్ (ఇంటర్నేషనల్ ఫిడే బ్లిట్జ్ రేటింగ్ –1,503), కేవీఎస్ చేతన్ రెడ్డి (1,331), అనిల్‌కుమార్ పూజారి (1,270), జానపాటి రోహిత్ (1,182), అస్మిత అనిమి (1,205), జొన్నగడ్డల నితీష్‌చౌదరి (1,122), భీమరాజు లక్ష్మీమణిదీప్ (1,065), యశస్విని అనిమి (1,033) ఉన్నారు.

భగవద్గీత సకల సమస్యల పరిష్కార మార్గం



భగవద్గీత ప్రచారం నిర్వహిస్తున్న ఇందూ ప్రచార వేదిక సభ్యులు

అనంతపురం కల్చరల్: సకల సమస్యలకు పరిష్కార మార్గమైన భగవద్గీత ఇంటింటా పఠించాలని ఇందూ ధర్మ వేదిక అధ్యక్షుడు మల్లికార్జున అన్నారు. మంగళవారం తపోవనం పరిసర ప్రాంతాల్లో ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల భగద్గీత ధర్మ ప్రచారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఇందువులు అంటే జ్ఞానులని, త్రైత సిద్ధాంతం జీవాత్మ, ఆత్మ, పరమాత్మ వైశిష్ట్యాన్ని తెలియజేస్తుందని ఈనాటి పరిస్థితులకనుగుణంగా యోగీశ్వరులు గీతాసారాన్ని తెలియజేశారన్నారు. ప్రతి వారూ గీతా ప్రచారంలో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో ఫక్కీరప్ప, శ్రీరాములు, నాగిరెడ్డి, అనురాధ, రేఖ, యశోద తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం



తల్లిపాల ప్రాముఖ్యతను తెలియజేస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

అనంతపురం సెంట్రల్: తల్లిపాలు బిడ్డ ఆరోగ్యానికి శ్రేయస్కరమని మూడో సెక్టార్ సూపర్‌వైజర్ విష్ణువర్ధని తెలిపారు. మంగళవారం నగరంలో రాణీనగర్‌లో తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకొని అవగాహన ర్యాలీ, మానవహారం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా విష్ణువర్ధని మాట్లాడుతూ తల్లి కాన్పు వెంటనే బిడ్డకు ముర్రుపాలు పట్టించడం ద్వారా వ్యాధి నిరోధకశక్తిని పెంపొందుతుందన్నారు. బిడ్డకు మొదటి టీకా అని, దేవుడిచ్చిన వరంలాగా తల్లులు భావించాలని సూచించారు. డబ్బాపాలు అనర్థకమని, ఆరునెలల వయస్సు వరకూ తల్లిపాలు తాపించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు లక్ష్మీనరసమ్మ, నక్షత్ర పాల్గొన్నారు.

అనంతపురం రూరల్: తల్లిపాలతోనే బిడ్డ అన్ని విధాలా ఆరోగ్యంగా ఉంటుందని ఐసీడీఎస్ సీడీపీఓ ధనలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం ఏ నారాయణపురం, కక్కలపల్లి కాలనీ పంచాయతీల పరిధిలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతను తెలియజేశారు. సీడీపీఓ మాట్లాడుతూ తల్లిపాలే బిడ్డ ఆరోగ్యానికి శ్రీరామ రక్ష అన్నారు. గర్భిణులు, బాలింతలు ఆకుకూరలు, పండ్లు, గుడ్లు తీసుకోవడం వల్ల తల్లీబిడ్డకు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో కక్కలపల్లి పంచాయతీ సర్పంచ్ తేజశ్విని, ఉప సర్పంచ్ ఇమాంబీ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భారతి, అంగన్‌వాడీ కార్యకర్తలు సరళకుమారి, అపర్ణ, హుస్సేన్‌బీ, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశలోనే లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి



విశ్రాంత డిప్యూటీ కలెక్టర్‌ను సన్మానిస్తున్న ఎల్‌ఎం ఉమ

అనంతపురం: విద్యార్థి దశలోనే లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని మాజీ వ్యవసాయశాఖ సలహాదారు అంబటి కృష్ణారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్‌ఎం ఉమ పేర్కొన్నారు. మంగళవారం గ్రూప్ –2, డీఎస్సీ, ఎస్ఎస్‌సీ, పోలీస్ కానిస్టేబుల్ తదితర పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు దోహదపడే పుస్తకాలను గ్రంథాలయ సంస్థకు విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ గోవిందరాజులు వితరణ చేశారు. అనంతరం అంబటి కృష్ణారెడ్డి, ఎల్‌ఎం ఉమ మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యంతో ముందుకు వెళ్లాలన్నారు. గ్రంథాలయానికి పుస్తకాలు ఉచితంగా ఇచ్చినందుకు గోవిందరాజులును అభినందించారు. ఎల్‌ఎం మోహన్‌రెడ్డి మాట్లాడుతూ దాతలు ముందుకొచ్చి గ్రంథాలయానికి పుస్తకాలు, ఫర్నీచర్ వితరణ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ, ఉప గ్రంథాలయ అధికారి సుబ్బరత్నమ్మ, సీనియర్ అసిస్టెంట్ కే శివశంకర్, ఇంతియాజ్ అహ్మద్, బాషా, కావేరి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించాలి



బాలింతలతో మాట్లాడుతున్న జీజీహెచ్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర రావు

అనంతపురం క్రైం: గర్భిణులు, బాలింతలకు మెరుగైన సేవలు అందించాలని ప్రభుత్వ సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం ఆస్పత్రిలోని గైనిక్ వార్డును ఆయన పరిశీలించారు. అక్కడ అందుతున్న సేవలపై బాలింతలను అడిగి తెలుసుకున్నారు. డైట్ సక్రమంగా అందిస్తున్నారని, వైద్యులు, స్టాఫ్‌నర్సుల పనితీరు ఏవిధంగా ఉందని ఆరా తీశారు. రక్తపరీక్షల నిర్వహణను ఆయన పరిశీలించారు. సూపరింటిండెంట్ వెంట అసిస్టెంట్ ఆర్ఎంఓలు డాక్టర్ అభిషేక్, డాక్టర్ సునీత, నర్సింగ్ సూపరింటిండెంట్లు మంజు, రజిని ఉన్నారు.

ఆరోగ్య శ్రీ సేవల్లో ప్రగతి సాధించాలి: ఆరోగ్యశ్రీ సేవల్లో ప్రగతి సాధించాలని సూపరింటెండెంట్ సంబంధిత వైద్యులను ఆదేశించారు. ప్రతి కేసును ఆరోగ్య శ్రీ కింద నమోదు చేయాలన్నారు. రోగుల వివరాలు ఆన్‌లైన్‌లో పొందుపర్చాలన్నారు. అధిక సంఖ్యలో కేసులు చేయడం ద్వారా ఆస్పత్రికి నిధులు వస్తాయన్నారు.

జేఎన్‌టీయూఏలో కారుణ్య నియామకాలు




రాజేశ్వరికి ఉద్యోగ నియామక ఉత్తర్వులు అందిస్తున్న వీసీ ప్రొఫెసర్ జింకా రంగజనార్ధన

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురంలో కారుణ్య నియామకాలు చేపట్టారు. ఇన్‌స్ట్రుమెంట్ రిపేరర్‌గా పనిచేస్తున్న ఎస్.మహమ్మద్ రఫీ అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన కుమారుడు తన్వీర్ అహమ్మద్‌కు అటెండర్‌గా ఉద్యోగం ఇచ్చారు. రికార్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఎ. సునీల్ కుమార్ అనారోగ్యంతో మరణించాడు. ఆయన భార్య బి. రాజేశ్వరికి స్వీపర్‌గా ఉద్యోగం ఇచ్చారు. జేఎన్‌టీయూ అనంతపురం వీసీ ప్రొఫెసర్ జింకా రంగజనార్ధన చేతుల మీదుగా వారికి ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్ ఎం. విజయకుమార్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి. శశిధర్, క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ, వర్సిటీ డిప్యూటీ రిజిస్ట్రార్ మధుసూదన్ రెడ్డి, కళాశాల డిప్యూటీ రిజిస్ట్రార్ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి

అనంతపురం రూరల్: గ్రామీణ నీటి సరఫరా పథకంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ ఎదుట రిలేదీక్ష చేపట్టారు. ఓబులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల నుంచి పని చేస్తున్న కార్మికులకు సరైన గుర్తింపు లేదన్నారు. కార్మికులతో అధికారులు, ప్రజాప్రతినిధులు చర్చించి, సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సత్యసాయి వాటర్ సప్‌లై కార్మికులు వన్నూరప్ప, శ్రీనివాసులు, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

దిశ డీఎస్పీ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న ఆంథోనప్ప

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: దిశ డీఎస్పీగా ఆంథోనప్ప నియమితులయ్యారు. మంగళవారం సాయంత్రం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఎస్సీ, ఎస్టీ సెల్‌కు ఇన్‌చార్జ్ డీఎస్పీగా కొనసాగనున్నారు.

ఆర్‌బీకేల ద్వారా ఎరువుల అమ్మకాలు పెంచాలి

- డీఈఏఓ ఉమామహేశ్వరమ్మ ఆదేశం

అనంతపురం అగ్రికల్చర్: ఆర్‌బీకేల ద్వారా ఎరువులు అమ్మకాలు పెరగాలని డీఏఓ ఉమామహేశ్వరమ్మ ఆదేశించారు. మంగళవారం స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఏడీఏలు, మార్క్‌ఫెడ్ అధికారులతో ఎరువులు అంశంపై ఆమె సమీక్షించారు. ఖరీఫ్ ఎరువుల ప్రణాళికలో భాగంగా కోటా మేరకు వివిధ కంపెనీల నుంచి అన్ని రకాల ఎరువులు సరఫరా అవుతున్నట్లు తెలిపారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 50వేల మెట్రిక్ టన్నుల మేర అందుబాటులో ఉన్నాయన్నారు. అందులో 50 శాతం మార్క్‌ఫెడ్‌కు కేటాయించి అక్కడి నుంచి ఆర్‌బీకేలకు తగినంత సరఫరా చేసి రైతులకు అందుబాటులో పెట్టాలని ఆదేశించారు. సమావేశంలో మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ పెన్నేశ్వరి, రేక్ ఆఫీసర్ రవి, టెక్నికల్ ఏఓ బాల నాయక్, హబ్ ఇన్‌చార్జ్‌లు, సేల్స్ ఆఫీసర్లు పాల్గొన్నారు.